

**వివాదాలకు చిరునామా డీఈఓ**

ఆమె లక్షలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు, జిల్లా మొత్తం విద్యాశాఖకే ఉన్నతాధికారి. అనతి కాలంలోనే.. వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. - 8లో



**జిల్లాకే ప్రథమం.. అన్నమాచార్య విశ్వవిద్యాలయం**

జిల్లాకే ప్రప్రథమంగా అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. ఈ నెల 9న హర్యానా గవర్నర్ దీనిని ప్రారంభించనున్నారు. - 8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.110 | రూ.140 |
| రెండోరకం | రూ.80 | రూ.100 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 105 మెట్రిక్ టన్నులు

**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 570 | 570 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 79.400 కిలోలు

## న్యూస్‌రీల్

### 18న నవోదయ ఎంపిక పరీక్ష

మదనపల్లె సిటీ : జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఈనెల 18వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.వేలాయుధన్ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 26 సెంటర్లలో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్లు https://navodaya.gov.in లేదా https://cbseitms.rcil.gov.in/nvs నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చునన్నారు. 10.30 లోగా పరీక్ష కేంద్రానికిచేరుకోవాలన్నారు. 10.45 నుంచి 11.30 వరకు లోపలికి అనుమతిస్తామన్నారు. తరువాత అనుమతించమన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందన్నారు. అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్‌లో ఏదైనా సమస్య వున్నా, రిజిస్ట్రేషన్ నంబరు మరచి పోయినా హెల్ప్‌డెస్క్ 8919956395, 9401832148లో సహాయం పొందవచ్చునన్నారు.

### 10న రాజ్యాంగ పరిరక్షణపై సెమినార్

రాయచోటి అర్బన్ : రాయచోటిలో ఈనెల 10వ తేదీన రాజ్యాంగంపై జరుగుతున్న దాడులపై సెమినార్‌ను నిర్వహించనున్నట్లు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ తెలిపారు. 'రాజ్యాంగంపై జరుగుతున్న దాడులు – రాజ్యాంగ పరిరక్షణ – మన తక్షణ కర్తవ్యం' అనే అం శంపై శుక్రవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సెమినార్ జరుగుతుందన్నారు. సెమినార్‌కు ప్రధానవక్తగా నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ అంజిరెడ్డి, వక్తగా డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావులు హాజరవుతారని తెలిపారు. మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, విద్యావంతు లు,ప్రజాసంఘాల నేతలు హాజరుకావాలని కోరారు.

### రైతు దంపతులకు అవార్డు



రైతు దంపతులను సత్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, లావురత్తయ్య

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బి.రాచపల్లికు చెందిన దంపతులు మోపూరి శ్రీనాథ్‌రెడ్డి, మాధవి సేంద్రియ అభ్యుదయ రైతు అవార్డును పొందారు.ముందస్తు సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయంపై మక్కువతో ఐటీ ఉద్యోగాన్ని వదులుకొని తమకున్న భూమిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ ఆరోగ్యవంతమైన పంటలు పండిస్తూ చుట్టుపక్కల గ్రామాల రైతులకు సేంద్రియ వ్యవసాయం పట్ల ఆసక్తి కలిగించి శ్రీనాథ్‌రెడ్డి దంపతులు యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ, వైస్ ఛాన్సలర్ నాగభూషణం ముఖ్యఅతిథిగా నరసరావుపేట లోక్ సభ సభ్యులు లావుశ్రీకృష్ణదేవ రాయలు పాల్గొన్నారు.

### 406 మంది హాజరు



కానిస్టేబుల్ ఉద్యోగాల దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

కడప అర్బన్ : పోలీసు కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కడప నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డీటీసీ)లో దేహదారుఢ్య పరీక్షలు 6వ రోజు కొనసాగాయి. ఈ పరీక్షలను ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు పర్యవేక్షించారు. సోమవారం 600 మంది అభ్యర్థులకుగాను 406 పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 247 మంది క్వాలిఫై అయ్యారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య, డీఎస్పీలు,సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటికోర్ టీమ్, డీపీఓ కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

### వీరభద్రస్వామికి పల్లకీ సేవ



రాయచోటి టౌన్ : రాయచోటిలోభద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి వారు పల్లకీలో ఊరేగారు. సోమవారం స్వామి వారి మూల విరాట్టుకు పూజలు నిర్వహించి, ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించారు. పల్లకీలో కొలువుదీర్చి మాఢ వీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. ఈఓ రమణారెడ్డి భక్తులు పాల్గొన్నారు.

# పదింతల ప్రణాళిక

- 2025 మార్చి 17 నుంచి 31 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- మారిన సిలబస్, పరీక్ష విధానం, మెలకువలు సూచిస్తున్న టీచర్లు

| | |
|---|---|
| ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు | : 304 |
| పదో తరగతి పరీక్షకు హాజయ్యే విద్యార్థులు | : 23,311 |

మదనపల్లె సిటీ : పదో తరగతి వార్షిక పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. మార్చి 17 నుంచి పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల్లో మార్కు చూపాలంటే పదింతల ప్రణాళిక ఉండాలి. నిత్యం సాధన చేయాలంటున్నారు విషయ నిపుణులు. ఆయా సబ్జెక్టులపై పట్టున్న ఉపాధ్యాయులు ఇక్కడి నుంచి విద్యార్థులకు మెలకువలు చెబుతున్నారు.



పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

### సూత్రాల లెక్క తప్పొద్దు



గణిత పాఠ్యాంశాల్లోని సూత్రాలపై పట్టు సాధిస్తే ఎక్కువ మార్కులు పొందేందుకు వీలుంటుంది. సూత్రాలు, త్రిభుజాలను బాగా నేర్చుకోవాలి. వాస్తవ సంఖ్యల నుంచి సమితి నిర్మాణ రూపం, రోస్టర్ రూపంలోకి మార్చడం వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. అంకశ్రేణి లేదా గుణశ్రేణి నుంచి ప్రాథమిక సమస్యలు, సాంఖ్యకశాస్త్రం నుంచి కొన్ని ప్రాథమిక సమస్యలపై ప్రశ్నలు ఇస్తారు.

– వి.చలపతినాయుడు, గణిత ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె.

### తెలుగు సులువే

| అంశం | మార్కులు |
|---|---|
| అవగాహన ప్రతిస్పందన | 32 |
| వ్యక్తీకరణ – సృజనాత్మకత | 36 |
| భాషాంశాలు | 32 |



పరిచిత పద్యాలకు సంబంధించి అంశాలపై పట్టు సాధించాలి. శతక మాధుర్యంలో పద్యాలకు భావాలు నేర్చుకోవాలి. రామాయణంలోని కాండలు (ప్రధాన అంశాలు), వ్యాసరూప ప్రశ్నలపై పట్టు పెంచుకోవాలి. అపరిచిత గద్యాలు, విభాగంలో సంభాషణ, ప్రకటన, కరపత్రం,గేయం, కవితల్లోని ప్రశ్నలు వస్తుంటాయి. లఘు ప్రశ్నలపై కవి పరిచయాలు, ప్రత్యక్షదైవాలు, జలియన్‌వాలాబాగ్,ప్రకృతి సందేశంలోని కథానిక, కథ, వ్యాసాలపై సాధన చేయాలి. అలంకారాలను బాగా నేర్చుకోవాలి. బహుళైచ్ఛిక ప్రశ్నలు చదవాలి.

– ఎం.క్రిష్ణయ్య, తెలుగు ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్,మదనవనల్లె.

### చరిత్ర సృష్టించొచ్చు

| అంశం | మార్కులు |
|---|---|
| సమాచార,పట నైపుణ్యాలు | 30 |
| ఇతర అంశాలు | 70 |



సాంఘికశాస్త్రంలో చరిత్రను అర్థం చేసుకుని, రాజుల పాలన, గుర్తుంచుకుని, ప్రపంచ,దేశ చిత్రపటంపై పట్టు సాధిస్తే అధిక మార్కులు పొందేందుకు అవకాశం ఉంటుంది. భారతదేశ ప్రధాన భౌగోళిక స్వరూపాలు, పర్యావరణ ఉద్యమాలు, నేలల రకాలు, వ్యవసాయ పద్ధతులు, చరిత్రలో జాతీయోద్యమాలు, జాతీయాదాయం, తలసరి ఆదాయం , జలవనరులు, సంస్కృతి, ఆధునికత, ప్రపంచీకరణ వాటి పరిణామాలు, భారత ఆర్థిక వ్యవస్థ వివిధ రంగాలు వంటి అంశాలపై పట్టు సాధించాలి. ప్రపంచపటం, భారతదేశ పటం గుర్తించేటప్పుడు సెక్షన్, మ్యాప్ ప్రశ్న నంబరు స్పష్టంగా రాయాలి. రాజ్యాంగం మౌళిక లక్షణాలపై పట్టు పెంచుకోవాలి.

– ఆర్.మదన్‌మోహన్‌రెడ్డి, సాంఘిక శాస్త్రం, ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్,మదనపల్లె.

### గంటన్నరలో జీవశాస్త్రం

| ప్రశ్నలు | మార్కులు |
|---|---|
| ఒకమార్కులు ప్రశ్నలు | 06 |
| రెండు మార్కులు ప్రశ్నలు | 08 |
| నాలుగు మార్కుల ప్రశ్నలు | 20 |
| ఎనిమిది మార్కులు ప్రశ్నలు | 16 |




ప్రశ్నపత్రం ఒక్కటే అయినప్పటికీ జవాబుపత్రాలు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం వేర్వేరుగా ఇస్తారు. వివిధ వ్యవస్థలకు సంబంధించి డాక్టర్‌ను అడాల్సిన ప్రశ్న ఒకటి ఇచ్చే అవకాశం ఉంది. మానవుడు శ్వాస తీసుకోవడం విషయం చదవాలి. ఆయుర్వే మొక్కలు-వీటి ఉపయోగాలపై ప్రశ్న ఉంటుంది. అవయవదానం, రక్తదానం, బాల్యవివాహాలు నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, చెట్ల సంరక్షణపై స్లోగన్స్ పునశ్చరణ ముఖ్యం. ఫలదీకరణ విధానంపై దృష్టి పెట్టాలి.

– ఎం.సుధాకర్‌రరెడ్డి, బయాలజీ టీచర్, జెడ్పీహెచ్ఎస్,మదనపల్లె.

### ఆంగ్లంపై ఆందోళన వద్దు

| విభాగం | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| 1 | 25 | 30 |
| 2 | 17 | 40 |
| 3 | 03 | 30 |



ఆంగ్ల పుస్తకంలోని గ్రామర్, ఒకాబ్యూలరీలను బాగా నేర్చుకోవాలి. దీంతో పాటు ప్రోస్, పోయట్రీలోని పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటే మంచి మార్కులు పొందవచ్చు. బార్, ట్రీ డయాగ్రామ్స్ ఎక్కువ నేర్చుకోవాలి. డైరీ ఎంట్రీ, పద సమూహ ప్రశ్నలపై దృష్టి సారించాలి. లాంగ్వేజ్ స్కిల్స్ ముఖ్యం. బయోగ్రాఫికల్ స్కెచ్, ఇన్ఫర్మేషన్ ట్రాన్స్‌ఫర్ ప్రశ్నలు ఇస్తారు. వీటిని బాగా నేర్చుకుంటే మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు. డయాగ్రమ్ ఇచ్చి స్టేట్‌మెంట్ రాయండి అనే ప్రశ్న అడుగుతారు. యాక్టివ్,పాసివ్ వాయిస్ నుంచి ఎక్కువగా స్టేట్‌మెంట్ నుంచి ప్రశ్నలు వస్తాయి. పాఠ్యపుస్తకంలోని 92వ పేజీ, 192 పేజీల్లోని పదాలు చదవాలి.

– పి.మహమ్మద్‌ఖాన్, ఇంగ్లీష్ టీచర్, జెడ్పీహెచ్ఎస్.మదనపల్లె.

### సాధనతోనే హిందీలో మార్కులు

| అంశం | మార్కులు |
|---|---|
| భాషాకి బాత్ | 12 |
| ఆర్థ్ గ్రాహ్యత -ప్రతిక్రియ | 20 |
| కవుల జీవిత చరిత్ర | 08 |
| ఉపవాచకం(8 ప్రశ్నలు) | 24 |
| పద్య,గద్యభాగం(4 ప్రశ్నలు) | 20 |
| ఆరవ విభాగం | 16 |



హిందీ పలకడం వచ్చినప్పటికీ రాయడం సాధన చేస్తే సులువుగా ఉంటుంది. వ్యాకరణ అంశాలు నిత్యం అభ్యాసం చేయాలి. పరిచయాలు నేర్చుకోవాలి. గద్యభాగంలోని రచయితల పరిచయాలు సాధన చేయాలి. ఆధునిక పద్యభాగ సారాంశాలు నిత్యం చదవాలి. గగ్య భాగ సారాంశాలు నేర్చుకోవాలి. పత్రలేఖన్‌లో ఔపచారిక్ లేదా అనౌపచారిక్ పత్రలతో ఏదో ఒకటి నేర్చుకుంటే ఉత్తమ మార్కులు పొందవచ్చు. వాక్యదోషాలు, వ్యాకణ దోషాలు లేకుండా రాస్తే మార్కులు ఎక్కువగా సాధించవచ్చు.

– ఎస్.ముబారక్‌భాషా, హిందీ టీచర్, జెడ్పీహెచ్ఎస్,మదనపల్లె.

### ప్రత్యేక దృష్టి పెట్టాలి

| ప్రశ్నలు | మార్కులు |
|---|---|
| ఒకమార్కులు ప్రశ్నలు(6) | 06 |
| రెండు మార్కు ప్రశ్నలు(4) | 08 |
| మూడు మార్కులు ప్రశ్నలు(4) | 12 |
| ఎనిమిది మార్కుల ప్రశ్నలు(3) | 24 |



భాష్పీభవనం,మరుగుటకు భేదాలు, హ్రస్వదృష్టి, దీర్ఘ దృష్టి లోపాల సవరణ, ఎండమావులు, ఇంద్రధనస్సు ఏర్పడే విధానం, విద్యుత్ మోటారు, ఏసీ జనరేటర్, డీసీ జనరేటర్ పనిచేయు విధానం, క్వాంటాం సంఖ్యలు, పాలీ ఆఫ్ బే, హుండ్ నియమాలు, నూతన ఆవర్తన పట్టిక నిర్మాణం, ఘన పదార్థాపు విశిష్టోష్ణం కనుగొనడం, గాజులదిమ్మె, పట్టకం వక్రీభవన గుణకాలు, ఆమ్ల రసాయణ చర్యలకు సంబంధించి ప్రయోగాలు, స్ఫటిక జలం కృత్యం, ఆల్కహాల్, గ్లూకోజ్ ఆమ్లాలు చదువుకోవాలి. ఆమ్లాలు-క్షారాలు, పరమాణు నిర్మాణం తదితర వాటిపై పట్టు సాధించాలి.

– రసూల్ బావాజీ, భౌతికశాస్త్రం ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్,మదనపల్లె

## 7న కేంద్ర కరువు బృందం జిల్లాకు రాక



కరువు బృందం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : జిల్లాలో ఈనెల 7,8 తేదీల్లో కేంద్రం కరువు బృందం పర్యటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కరువు బృందం పర్యటన సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పరిశీలన బృందం ఈనెల 7న బెంగళూరు నుంచి మదనపల్లె డివిజన్ హార్స్ లీ హిల్స్ చేరుకొని అక్కడే బస చేస్తారన్నారు. 8వ తేదీ ఉదయం 9 గంటలకు హార్స్‌లీహిల్స్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని పేర్కొన్నారు. అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా నుంచి తిరిగి బెంగళూరు బయల్దేరి వెళ్తారన్నారు. 2024 ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో ఏర్పడిన కరువు పరిస్థితులను కేంద్ర బృందం అధ్యయనం చేస్తారన్నారు. అప్పటి పరిస్థితులను కళ్లకు కట్టే విధంగా ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసి బృందానికి వివరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్ రావు, ఇన్‌చార్జ్ సీపీఓ వెంకట పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలకు సత్వర పరిష్కారం**

ప్రజల సమస్యలకు సత్వరం పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అందిన అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం వివిధసమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసాలతో సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిళ్లు, టీ సౌకర్యాలు కల్పించారు. అర్జీదారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్య శిక్షణ ద్వారా ఉత్తమ ఫలితాలు రావాలి

రాయచోటి : జిల్లాలో నైపుణ్య శిక్షణ ద్వారా ఉత్తమ ఉపాధి ఫలితాలు వచ్చేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి స్కిల్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దాసరి నాగార్జున, కమిటీ సభ్యులు జిల్లాలో నైపుణ్య శిక్షణల గురించి వారి అభిప్రాయాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో చదువుకున్న నిరుద్యోగ యువతకు జీవనోపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే విధంగా కార్యక్రమాలను రూపకల్పన చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పీఎం ఇంటర్న్‌షిప్ కరపత్రాలను కలెక్టర్ జేసీలు ఆవిష్కరించారు.

## ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం రాయచోటిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ సూచించారు.

## జాతీయస్థాయి యూత్ ఫెస్టివల్‌కు కడప యువతి



సయ్యద్ సానియా

వైవీయూ : కడప నగరానికి చెందిన సయ్యద్ సానియాకు జాతీయస్థాయి యూత్ ఫెస్టివల్‌లో సమన్వయం చేసే అరుదైన అవకాశం లభించింది. దేశరాజధాని న్యూఢిల్లీలో జనవరి 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న 'నేషనల్ యూత్ ఫెస్టివల్-2025'లో నేషనల్ యంగ్ లీడర్‌షిప్ డైలాగ్ కార్యక్రమానికి యాంకర్‌గా వ్యవహరించనున్నారు. కడప నగరానికి చెందిన సయ్యద్ సానియా గతేడాది యూత్ పార్లమెంట్ ఫెస్టివల్-2024 కార్యక్రమంలో పాల్గొని పార్లమెంట్‌లో పాల్గొని ఉపన్యసించిన విషయం తెలిసిందే. ఇందులో పాల్గొన్న 32 మంది యువతను రెండు రౌండ్ల పోటీలు నిర్వహించి చివరగా యూత్ ఫెస్టివల్-2025 కార్యక్రమ నిర్వహణకు 10మంది యువతను ఎంపిక చేశారు. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక యువతి సానియానే కావడం విశేషం. ప్రధాని నరేంద్రమోదీ, యువజన, క్రీడలశాఖా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పాల్గొనే కార్యక్రమానికి జిల్లాకు చెందిన యువతి సమన్వయం చేసే అవకాశం లభించడం అభినందనీయమని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి మణికంఠ పేర్కొన్నారు. కాగా ఈమె కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఈమె తల్లి సోఫియా గృహిణి కాగా, తండ్రి సయ్యద్ జాఫర్‌వలి సైకిల్‌మార్ట్ నిర్వహిస్తున్నారు.

## ఒంటిమిట్టలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు



ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : ఈనెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో తిరుమల-తిరుపతి దేవస్థానం వారు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిపించేందుకు దాతల సహాయంతో నిర్వాహకులైన పోతున సాహితీ పీఠం కార్యదర్శి ముమ్మడి నారాయణ రెడ్డి, పసుపులేటి సుబ్బరాయుడు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి వేడుకలను దాతల సహాయంతో నిర్వహిస్తామని,, ఈ ఏడాది కూడా తామే జరపనున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం మేడా విజయ శేఖర్ రెడ్డి, ఆయన సతీమణి స్మిత పూల అలంకరణకోసం రూ. 2 లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు.వైకుంఠ ఏకాదశి వేడుకలను వీక్షించేందుకు లక్షలాదిగా భక్తులు విచ్చేసి స్వామి కృపను పొందాలని వారు కోరారు.



మాట్లాడుతున్న ముమ్మడి నారాయణ రెడ్డి, పసుపులేటి సుబ్బరాయుడు

# టీడీపీలో టెండర్ సెగలు

- ఆధిపత్య పోరులో టెండర్ రద్దు
- అమ్మ చెబితే అధికారులు పాటించాల్సిందే



ఏపీఎండీసీ క్యాంటీన్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఏపీఎండీసీ క్యాంటీన్ నిర్వహణ కోసం ఇటీవల నిర్వహించిన టెండర్‌లో టీడీపీ నాయకులు నీకా..నాకా అంటూ పోటీ పడ్డారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి క్యాంటీన్ టెండర్ తన వర్గం వారికి కావాలని మంగంపేట టీడీపీ నాయకులతో మంతనాలు జరిపారు. విఫలం కావడంతో రూపానందరెడ్డి వర్గంతోపాటు మంగంపేట టీడీపీ నాయకులు టెండర్‌లో పాల్గొని సొంతం చేసుకున్నారు. ఆమోదం కోసం ఏపీఎండీసీ అధికారులు విజయవాడ కేంద్ర కార్యాలయానికి పంపించారు. దీంతో టీడీపీ నాయకులు మధ్య సెగ రాజుకుంది.

టెండర్‌లో గోకుల్, శ్రీదేవి, ఫుడ్ మూడు కంపెనీలు మాత్రమే పాల్గొన్నాయి. అన్ని పత్రాలు సేకరించిన తరువాత నిబంధనల మేరకే ఏపీఎండీసీ కార్యాలయంలో క్యాంటీన్ నిర్వహణ కోసం అధికారులు టెండర్ నిర్వహించారు. అయితే నియోజకవర్గ ఇన్‌చార్జి వర్గానికి రాకపోవడంతో ఆయన సతీమణి ఏకంగా అక్రమంగా టెండర్‌ను రద్దు చేయించారు. అధికారులు సైతం అమ్మ ఆదేశిస్తే కచ్చితంగా పాటిస్తున్నారు. నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి కుటుంబ పాలన అన్ని విషయాల్లో తారాస్థాయికి చేరడంతో ఆ పార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. కొందరు నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సంవత్సరాలుగా టీడీపీ అభివృద్ధి కోసం పనిచేసిన కార్యకర్తలను అన్యాయంగా అణిచివేయడం జరుగుతోందని ఆ పార్టీ నాయకులు గుసగుసలాడుకుంటున్నారు.

**మరోసారి టెండర్ పిలుస్తాం**

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ క్యాంటీన్ నిర్వహణ కోసం మరోసారి టెండర్‌ను పిలవనున్నట్లు సీపీఓ సుదర్శన్ రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. ఇటీవల జరిపిన టెండర్లకు సంబంధించి గోకుల్, శ్రీదేవి, ఫుడ్డీస్ మూడు కంపెనీలు పాల్గొన్నాయన్నారు. వారు ఇచ్చిన పత్రాల్లో లోటుపాట్లు ఉండటంతో విజయవాడ కార్యాలయం తిరస్కరించిందన్నారు.ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు త్వరలో మరోసారి టెండర్లు పిలుస్తామని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లి : కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన సోమవారం రాత్రి మదనపల్లిలో జరిగింది. రెడ్డీస్‌కాలనీకి చెందిన వెంకటరమణ కుమారుడు శ్రీధర్(35) సోమవారం ఇంట్లో బాత్‌రూమ్‌లోకి వెళ్లి గడియ పెట్టుకుని గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు బాత్‌రూమ్ తలుపులు పగలగొట్టి బాధితుడిని బయటకు తీసుకురాగా, అప్పటికే తీవ్ర అస్వస్థతకు లోనై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు.

### తమ్ముడిపై అన్న కత్తితో దాడి

నిమ్మనపల్లె : భూ వివాదంలో కక్ష పెంచుకుని తమ్ముడిపై అన్న మరో వ్యక్తితో కలిసి కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ముష్టూరు పంచాయతీ ఎర్రప్పగారిపల్లెకు చెందిన చెంద్రాయప్పకు శంకర, గుర్రప్ప ఇద్దరు కుమారులు ఉన్నారు. వారికి ఉన్న ఐదెకరాల భూమిని మూడు సమ భాగాలుగా పంచుకున్నారు. శంకర స్థానికంగా ఉంటూ వ్యవసాయం చేస్తూ తండ్రిని చూసుకునేవాడు. గుర్రప్ప ఉపాధి రీత్యా బెంగళూరులో ఉండేవాడు. ఈ క్రమంలో తన వాటాకు సంబంధించిన భూమిని చెంద్రాయప్ప చిన్న కుమారుడు శంకర భార్య స్వర్ణకుమారి పేరుపై రిజిస్టర్ చేశాడు. రెండేళ్ల క్రితం తండ్రి చెంద్రాయప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచీ తండ్రికి సంబంధించిన భాగంలో సగం వాటా తనకు రావాలని గుర్రప్ప తరచూ శంకరతో గొడవపడేవాడు. ఆ భూమిపై కోర్టులో కేసు వేశాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి శంకర గ్రామ సమీపంలోని పొలాల్లో బహిర్భూమికి వెళుతుండగా, గుర్రప్ప మరో వ్యక్తితో కలిసి శంకరను అడ్డగించాడు. తనకు రావాల్సిన భూమి ఇవ్వకపోతే చంపేస్తానని కత్తితో ఉన్నపళంగా దాడిచేశాడు. దాడిలో కాలిపై గాయం కాగా, మరోసారి గొంతుపై పొడిచేందుకు ప్రయత్నించగా శంకర చేయి అడ్డుపెట్టడంతో తీవ్రగాయమైంది. గట్టిగా అరవడంతో స్థానికులు అక్కడికి వచ్చేలోపు నిందితులు పారిపోయారు. బాధితుడిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ రమేష్ తెలిపారు.

### యువకుల మధ్య ఘర్షణ

నందలూరు : నందలూరులో ఆదివారం సాయంత్రం క్రికెట్ ఆటలో తలెత్తిన వివాదం యువకుల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో కరిముల్లా అనే వ్యక్తికి గాయాలు కావడంతో కడప రిమ్స్‌కు తరలించారు. దాడికి పాల్పడ్డ వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### పెన్షన్ మంజూరు కోసం వచ్చి..

కడప సెవెన్‌రోడ్స్ : వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని చాలా రోజులుగా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో.. కలెక్టర్‌కు తన గోడు చెప్పుకొంటే ప్రయోజనం ఉంటుందని భావించి వ్యయ ప్రయాసల కోర్చి సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వచ్చిన ఓ వృద్ధుడు ఫిట్స్ రావడంతో సభా భవనం వద్ద పడిపోయాడు. దీంతో పీజీఆర్ఎస్ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో వాహనం అక్కడికి చేరుకోవడంతో వృద్ధుడిని వెంటనే ఎక్కించి రిమ్స్‌కు తరలించారు. పోరుమామిళ్ల మండలం రామనపల్లె గ్రామానికి చెందిన ఆ వృద్ధుడి పేరు రామయ్యగా తెలిసింది.

# జిల్లాకే ప్రథమం.. అన్నమాచార్య విశ్వవిద్యాలయం

- రాజంపేటలో ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య
- 9న హర్యానా గవర్నర్ దత్తాత్రేయచే ప్రారంభం



అన్నమాచార్య విశ్వవిద్యాలయం(ఏయూ)

రాజంపేట : జిల్లాకే ప్రప్రథమంగా అన్నమాచార్య విశ్వవిద్యాలయం(ఏయూ) ఏర్పాటైంది. దాదాపు 52 ఎకరాల్లో రాజంపేటలో ఏయూ ఏర్పాటు కావడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 9న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ అన్నమాచార్య యూనివర్సిటీని ప్రారంభించనున్నారు. గవర్నర్‌తోపాటు సినీ హాస్యనటుడు బ్రహ్మానందం, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్‌చౌదరి, యువనటుడు కిరణ్ అబ్బవరం పాల్గొంటారు. 1997లో అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటైంది. 1998లో అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ఆవిర్భవించింది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యను అందించాలన్న ఉద్దేశంతో విద్యావేత్త చొప్పాగంగిరెడ్డి కళాశాలను తీసుకొచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నమాచార్య యూనివర్సిటీ మంజూరు అయింది. ఈ నెల 9న బీహార్ గవర్నరు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

**అటానమస్.. న్యాక్ అక్రిడేషన్**

వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ రావడం వల్ల మూడుసార్లు న్యాక్ అక్రిడేషన్, ఎన్‌బీఏ మూడుసార్లు దక్కించుకుంది. అటానమస్‌గా గుర్తింపు కడప, తిరుపతి, హైదరాబాద్‌లలో ఇంజినీరింగ్ కళాశాలల బ్రాంచీలను ఏర్పాటు చేశారు.

**ఎందరో.. మరెందరో..**

రాజంపేట ఏఐటీఎస్‌లో విద్యనభ్యసించిన సినీ నటుడు అబ్బవరం కిరణ్, ప్రముఖ మెజీషియన్ మైనుద్దీన్‌తోపాటు ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. దేశ, విదేశాల్లో వేల సంఖ్యలో ఉన్నత స్థాయిలో కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఏ కార్యక్రమానికి, పోటీ పరీక్షలు, ఇతరత్రా పరీక్షలకు ఏఐటీఎస్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటోంది.

**అరుదైన అవకాశం**



రాజంపేటకు యూనివర్సిటీ మంజూరు అరుదైన అవకాశం. ఆ అవకాశాన్ని సీమ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. రాయలసీమకే తలమానికంగా నిలిచేలా ఏయూను తీసుకొస్తాం. అందరి కృషి, సహకారం మరువవలేనిది. బీహార్ గవర్నరు దత్తాత్రేయ ఏయూను ప్రారంభిస్తారు.

- చొప్పా గంగిరెడ్డి, చాన్స్‌లర్, ఏయూ, రాజంపేట

**రాజంపేటకే తలమానికం**



అన్నమయ్య యూనివర్సిటీ రాజంపేటకే తలమానికంగా నిలవనుంది. జిల్లాలో ఒక ప్రైవేటు యూనివర్సిటీ ఏర్పాటు కావడం, ఆ అవకాశం మాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాం. నాణ్యమైన విద్యను అందించడంలో ఏయూ ముందంజలో ఉంటుంది. అలాగే వేలాది మందికి ఉపాధి కల్పించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాం.

- చొప్పా అభిషేక్‌రెడ్డి, ప్రో చాన్స్‌లర్, రాజంపేట

# ఏఐటీఎస్‌లో అట్టహాసంగా సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు

- ఏయూ క్యాంపస్‌లో మూడు రోజుల పాటు సంబరాలు
- అన్నమాచార్య యూనవర్సిటీ అవార్డులు పంపిణీ
- అన్నమాచార్య యూనవర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి



మాట్లాడుతున్న అన్నమాచార్య యూనవర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : అన్నమాచార్య యూనవర్సిటీలో ఏఐటీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించనున్నట్లు అన్నమాచార్య యూనవర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి అన్నారు. సోమవారం తన చాంబర్‌లో తన సోదరుడు, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డితో కలిసి ఆయన విలేకరలతో మాట్లాడారు. మూడు రోజుల పాటు ఏయూ క్యాంపస్‌లో ఏఐటీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు, అన్నమాచార్య యూనవర్సిటీ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలిరోజున మంగళవారం సాయంత్రం ఎంపీ మేడా రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, రాజంపేట సబ్‌కలెక్టర్ వైకోమానైదియాదేవి హాజరు అవుతారన్నారన్నారు. బుధవారం ఆరు వేల మంది విద్యార్థులతో ఐదు కిలోమీటర్ల పాటు రాజంపేటలో యాంటీ డ్రగ్స్ ర్యాలీ ఉంటుందన్నారు. మత్తు మందులకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించే అద్భుతమైన కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. డ్రగ్స్ వ్యతిరేకంగా పదం కదిలిపితే, అడుగువేస్తే అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చడానికి కారణమవుతందన్నారు. రాజంపేటలో ఉదయం 7.30 గంటలకు యూనవర్సిటీ ప్రాంగణం నుంచి సమూహం కదిలి జనచైతన్యం కలిగిస్తుందన్నారు. కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ప్రారంభించనున్నారన్నారు. ఇందులో అన్నమాచార్య ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సీ.రామచంద్రారెడ్డి, ఏయూ ప్రో-చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి పాల్గొనడం జరుగుతుందన్నారు. విద్యార్థుల ర్యాలీలో సినీనటుడు కేవీప్రదీప్ పాల్గొంటారన్నారు. పెద్ద సామాజిక ప్రయోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అదే రోజు సాయంత్రం సీమలో వివిధ విభాగాలలో రాణించిన వారికి అన్నమాచార్య యూనివర్సిటీ అవార్డు కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందుకు మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ జి.సతీష్‌రెడ్డిలు హాజరు కానున్నారన్నారు. మూడవ రోజున సాయంత్రం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ చౌదరి, అబ్బవరం కిరణ్‌లు హాజరు కానున్నారని వెల్లడించారు. అన్నమాచార్య యూనవర్సిటీ ఆవిర్భావం, రాజంపేట ప్రాంతంలో ఉన్నత విద్యాభివృద్ధికి నిదర్శనమన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అనాథలైన ఇద్దరు కుమారులు



ఆత్మహత్య చేసుకున్న సంజీవరాజు

బి.కొత్తకోట : ఇద్దరు కుమారులతో కలిసి నిద్రించిన తండ్రి ఉదయాన్నే నిద్ర లేచాడు. నిద్రపోతున్న కుమారుడిని లేపి సమయం ఎంతైందని అడిగితే 6.20 గంటలైందని చెప్పగా.. అతను ఇంటి నుంచి వెళ్లిన అరగంటలో తండ్రి ఇకలేరు అన్న కబురు వచ్చింది. బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీ గుడ్లవారిపల్లెలో సోమవారం ఈ సంఘటన జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుడ్లవారిపల్లెకు చెందిన సంజీవరాజు(45) కూలి పనులు చేసుకుని పిల్లలను పోషించుకొంటూ జీవిస్తున్నాడు. ఆయన భార్య విజయనిర్మల 15 ఏళ్ల క్రితమే మృతి చెందింది. కుమారులు హరీష్‌కుమార్ రాజు (19) డిగ్రీ చివర సంవత్సరం, లోకేష్ రాజు (17) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. అందరూ ఇంటిలో పడుకోగా ఉదయమే నిద్ర లేచిన సంజీవరాజు.. చిన్న కుమారుడిని నిద్ర లేపి టైం ఎంతైందని అడగ్గా మొబైల్‌లో చూసి 6.20 గంటలైందని చెప్పాడు. తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లిన సంజీవరాజు ఊరి సమీపంలోని వంకలోకి వెళ్లి.. అక్కడ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చెట్టుకు పైన తాడు కట్టి కొమ్మ పైనుంచి మెడకు తాడు బిగించుకుని కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి పాదాలు నేలకు తాకుతున్నాయి. తాడు, మెడ సాగినట్టుగా కనిపిస్తున్నాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు హరీష్‌కుమార్ రాజు తన తండ్రి సంజీవరాజు నాలుగైదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈ కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్టు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పసితనంలోనే తల్లి దూరమవగా ఇప్పుడు తండ్రి కూడా తమను వదిలి వెళ్లడంతో.. ఆ ఇద్దరు బిడ్డలు అనాథలయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న సీడీపీఓ శశికళ

రాయచోటి అర్బన్ : రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల 9 నెలల అద్దె బకాయిలు చెల్లించే వరకు పోరాటం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, కోశాధికారి బంగారుపాప మాట్లాడుతూ రాయచోటి ప్రాజెక్టు పరిధిలోని చిన్నమండెం, రాయచోటి, సంబేపల్లె మండలాల్లో అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు 9 నెలలుగా అద్దెను చెల్లించకపోవడం దారుణమన్నారు. అద్దెభవనాల యజమానులు అద్దె కోసం అంగన్‌వాడీ వర్కర్లపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్‌ల నిర్వహణలో భాగంగా కూరగాయలు, గ్యాస్ తదితరాల కొనుగోలు కోసం అప్పులు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ప్రభుత్వం మాత్రం సెంటర్‌ల నిర్వహణకు అవసరమైన బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో కేటాయించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. బిల్లుల చెల్లింపులో ఐసీడీఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారా? లేక కూటమి ప్రభుత్వం బిల్లుల చెల్లింపునకు తగిన నిధులు విడుదల చేయడం లేదా? అనే అంశంపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేయాలన్నారు. వెంటనే బిల్లులు చెల్లించని పక్షంలో ఈ నెల 11వ తేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామంటూ హెచ్చరించారు. రాయచోటి ఐసీడీఎస్ సీడీపీఓ శశికళ ధర్నానుద్దేశించి మాట్లాడుతూ వెంటనే నాలుగు నెలల పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని, మిగిలినవి సంక్రాంతి తర్వాత చెల్లిస్తామంటూ హామీ ఇవ్వడంతో కార్యకర్తలు ధర్నాను విరమించారు. అనంతరం ఆల్‌ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ రాయచోటి కార్యాలయం ఎదుట కార్యకర్తలు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో రాయచోటి ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ, నాయకురాళ్లు విజయ, నాగమణి, అరుణ, సబీనా, సుమలత, లక్ష్మీదేవి, రమణమ్మ, జయాంజలి, ఉమతో పాటు పలువురు వర్కర్లు పాల్గొన్నారు.

## ఎర్రచందనం

### అక్రమ రవాణాపై నిఘా

టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్



అటవీ సిబ్బందికి సూచనలిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

బద్వేలు అర్బన్ : ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఫారెస్టు కాంప్లెక్స్‌లో వివిధ రేంజ్‌ల ఎఫ్ఆర్‌ఓలు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎర్రచందనం పరిరక్షణకు అటవీ ప్రాంత సమీపంలోని ప్రజల సహకారం తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎర్రచందనం స్మగ్లర్లు ప్రవేశిస్తున్న మార్గాలు, లోడింగ్, అన్‌లోడింగ్ పాయింట్లను గుర్తించి బేస్‌క్యాంపులు పటిష్టం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎర్రచందనం స్మగ్లింగ్ ప్రభావిత గ్రామాల్లో ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని కోరారు. ఎర్రచందనం అక్రమ రవాణా నేరానికి పదే పదే పాల్పడే వ్యక్తులపై పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బద్వేలు, పోరుమామిళ్ల, వనిపెంట ఎఫ్ఆర్‌ఓలు నయీమ్‌అలీ, రఘునాథరెడ్డి, ప్రణీత్‌రావు పాల్గొన్నారు.

# అధ్యయన సామగ్రి సద్వినియోగం చేసుకోండి



అధ్యయన సామగ్రిని, డైరీని ఆవిష్కరించిన డీఈఓ సుబ్రహ్మణ్యం

రాయచోటి టౌన్ : అధ్యయన సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్‌టీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన పదవ తరగతి అధ్యయన సామగ్రిని, డైరీని అన్నమయ్య జిల్లా డీఈఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమైన భావనలతో కూడిన ఈ అధ్యయన సామగ్రి 10వ తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమైన ఉత్తర్వులతో కూడిన డైరీ ఉపాధ్యాయులకు సేవా నిబంధనలపై అవగాహన పెంపొందించుకునేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి, సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తక రచయిత మడితాటి నరసింహారెడ్డి, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరాజు, జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు శివారెడ్డి, రాష్ట్ర నాయకులు రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మురళీకుమార్, సీసీఎస్ కన్వీనర్ గోపికృష్ణ, జిల్లా మైనార్టీ కన్వీనర్ అంజద్‌బాషా, నాయకులు వాసుదేవరెడ్డి, నాగరాజు, రమణయ్య, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



సుబ్బారెడ్డి (ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధిలోని గంగపేరూరు గ్రామానికి చెందిన దూళ్ళ సుబ్బారెడ్డి(57) అనే రైతు అప్పుల బాధ తాళలేక శనివారం రాత్రి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆయన చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒంటిమిట్ట మండలం గంగపేరూరు గ్రామానికి చెందిన దూళ్ళ సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులు గత కొంత కాలంగా కొత్త మాధవరంలోని ఆవుల మారెమ్మ గుడి వద్ద నివాసం ఉంటున్నారు. సుబ్బారెడ్డి నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని దోస, వరి, పంటలు పండిస్తున్నారు. ఈ క్రమంలో సుబ్బారెడ్డి వ్యవసాయం కోసం పలు చోట్ల అప్పులు చేశాడు. తాను సాగు చేసిన పంటలకు సరైన దిగుబడి రాకపోవడంతో క్రమేణా అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన సుబ్బారెడ్డి ఈ నెల 4వ తేదీన ఎవరూ లేని సమయంలో గంగపేరూరు లోని తన స్వగృహంలో విష ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు సుబ్బారెడ్డిని వైద్యం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు సుబ్బారెడ్డి భార్య దూళ్ళ కుమారి తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. సుబ్బారెడ్డికి ఇద్దరు కుమారులు ఉన్నారు.



## ముగిసిన మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు

- రాష్ట్రస్థాయికి 25 మంది క్రీడాకారుల ఎంపిక
- విజేతలకు ట్రోఫీల బహూకరణ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల ముగింపు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు, ట్రోఫీలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసు పెరిగేకొద్దీ ఆరోగ్యంగా ఉండేందుకు ఏదో ఒక క్రీడను ఎంపిక చేసుకుని ఆడాలని సూచించారు. జిల్లాలో ఓ వయసు దాటిన తర్వాత ఎక్కువ మంది బ్యాడ్మింటన్ క్రీడ ఆడుతుండటం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. టోర్నమెంట్ రెఫరీ, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ ఎస్.జిలానీబాషా మాట్లాడుతూ చాలా మంది క్రీడాకారులు యువ క్రీడాకారులకు దీటుగా చక్కటి ప్రదర్శనతో రాణించారన్నారు. అదే స్ఫూర్తిని రాష్ట్రస్థాయి పోటీల్లో కనబరచాలని సూచించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరిలో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, డీఎస్ఏ కోచ్ సుదర్శన్, అఫిషియల్స్ మనోహర్‌బాబు, చంద్రబాబురెడ్డి, సోనీశామ్యూల్, మహేష్, షామీర్, జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు**

**35 ప్లస్ విభాగం :** ఎస్.షరీఫ్-ఎం.హరికిశోర్, టి.సూర్యమోహన్- జె.లోకేష్

**మిక్స్‌డ్ డబుల్స్ :** ఎ.మధుసూధన్‌రెడ్డి-ఎ.దేవి.

**40 ప్లస్ విభాగం :** జి.సురేష్-డి.వి.సుబ్రమణ్యం, పి.బాలాజీ-ఆర్.రామకృష్ణ

## పరికరాల అమరికలో జాగ్రత్తలు తీసుకోవాలి

కడప అగ్రికల్చర్ : గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల పొలాలకు అమర్చే బిందు, తుంపర సేద్య పరికరాల అమరికలో ఇంజినీర్లు, ఎఫ్‌సీఓలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం(ఏపీ ఎంఐపీ) ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం కడప కలెక్టరేట్‌లోని ఏపీ ఎంఐపీ పీడీ కార్యాలయంలో జిల్లా ఎంఐ కంపెనీ ఇంజినీర్లు, ఎఫ్‌సీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–15 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 29,300 హెక్టార్లకు సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. బిందు, తుంపర సేద్య పరికరాలు అవసరం ఉన్న ప్రతి రైతు తమ పరిధిలోని ఆర్ఎస్‌కేలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఐపీ ఎంఐ ఇంజినీర్లు, ఎంఐడీసీలతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# వివాదాలకు చిరునామా డీఈఓ



డీఈఓకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు



జేసీ అధితిసింగ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఐక్య ఉపాధ్యాయ సంఘ నేతలు

- అనతి కాలంలోనే ఆరోపణల వెల్లువ
- డీఈఓ తీరును వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయులు
- ఆ అధికారి మాకొద్దంటూ సంఘాల ధర్నా
- విచారణ జరిపించాలని పట్టు

టాస్క్‌ఫోర్స్ (వైఎస్ఆర్ జిల్లా) : ఆమె లక్షలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు, జిల్లా మొత్తం విద్యాశాఖకే ఉన్నతాధికారి. అందరికీ ఆదర్శంగా ఉంటూ విద్యార్థుల అభ్యుదయానికి బాటలు వేయాల్సి ఉంది. అలాంటి ఉన్నతాధికారి బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే.. వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. పలు రకాల ఆరోపణలు మూటగట్టుకున్నారు. అటు విద్యార్థి సంఘాలతోపాటు ఇటు ఉపాధ్యాయుల సంఘాలు సైతం డీఈఓ మీనాక్షి తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చివరికి ఈ డీఈఓ మాకొద్దంటూ ఒకటి రెండు ఉపాధ్యాయ సంఘాలు కాదు, అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఏకమై డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బహుశా అలాంటి ఘటన విద్యాశాఖలో ఇదే ప్రథమం కావచ్చు. డీఈఓ తీరును అటు కార్యాలయ సిబ్బంది కూడా వ్యతిరేకిస్తుండటం గమనార్హం. ఆమె పాఠశాలలకు తనిఖీకి వెళ్లినప్పుడు అక్కడ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల పట్ల ఆమె వ్యవహారశైలి పలు వివాదాలకు తెరలేపుతోంది. దీంతో ఆమె తీరును వారు సైతం తూర్పార పడుతున్నారు. అంతేకాకుండా సమగ్రశిక్షలో పని చేస్తున్న ఓ సెక్టోరియల్ అధికారి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతికి కూడా డీఈఓ కారణమనే ఆరోపణలు వచ్చాయి.

**టైపిస్టు నుంచి ఎఫ్ఏసీ డీఈఓగా..**

ఈమె ఉద్యోగ ప్రస్థానం టైపిస్టుగా ప్రారంభమైంది. తరువాత పలు పదోన్నతులతో చివరకు ఎఫ్ఏసీ డీఈఓగా మీనాక్షి కడపకు వచ్చారు. ఈమె నాన్ టీచింగ్ వైపు నుంచి రావడంతో అకడమిక్ వైపు సరైన అవగాహన లేదనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలకు తనిఖీలకు వెళ్లినప్పుడు అక్కడ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను కించపరిచేలా వ్యవహరిస్తుండటంతోపాటు గౌరవం లేకుండా సంబోధిస్తుండటం.. గంటల తరబడి వారిని నిలబెట్టి ఇబ్బందులకు గురి చేస్తోందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతోపాటు విద్యార్థుల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల పట్ల కూడా సరిగా స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అలాగే ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయుల సమస్యలపైన కార్యాలయానికి వస్తే.. సరైన మర్యాద ఇవ్వకపోడంతోపాటు ఫోన్లు సైతం లిఫ్ట్ చేయడం లేదని పలువురు సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. అన్ని రకాల సమస్యలతో విసుగెత్తిన సంఘాలు చివరకు సంబంధిత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు కూడా ఆమెను మందలించి సర్దుకోవాలని చెప్పారని.. అయినా మార్పు రాలేదని తెలిసింది. చివరకు ఉపాధ్యాయ సంఘాలు అల్టిమేట్‌గా డీఈఓకు వ్యతిరేకంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులంతా కలిసి 'ఈ డీఈఓ మాకొద్దంటూ' నినాదాలతో ధర్నా చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈమె తీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

**లెసెన్ ప్లాన్ అడిగినందుకే ఆరోపణలు**

పాఠశాలను విజిట్ చేసినప్పుడు ప్రధానోపాధ్యాయులను లెసన్ ప్లాన్ అడిగినందుకే నాపై ఆరోపణలు చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో లెసెన్‌ప్లానే పాటించడం లేదు. నేను పాఠశాలలను విజిట్ చేసినప్పుడు అందులో ఒక కాలం ఉంటుందని, దానిని నేను ఫిల్ చేసి పంపాలన్నాను. కొన్ని పాఠశాలల్లో డిజిటల్ లెసన్‌ప్లాన్ అమలు చేస్తున్నామని చెబుతున్నారని, దానిని కూడా చూపడం లేదన్నారు. అప్పటికీ నేను మళ్లీ విజిట్‌కు వచ్చినప్పుడు చూపాలని చెప్పి వస్తున్నాను తప్ప ఎవరినీ వేధించలేదు. నాపై వచ్చే ఆరోపణలన్నీ అవాస్తవాలే. ఆర్‌జేడీ నన్ను పది రోజులు పాఠశాల విజిట్‌కు వెళ్లవద్దని చెప్పారు. అందుకే విజిట్‌కు వెళ్లడం లేదు.

- మీనాక్షి, డీఈఓ, వైఎస్ఆర్ జిల్లా